

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి  సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### పిరికివాడు

**సెల్‌ఫోన్** అదే పనిగా మోగడంతో సుందరం బైక్‌ని ఓ పక్కగా ఆపి, జేబులోంచి ఫోన్ తీసి చూసాడు. శారద నించి. ఐదు నిమిషాల క్రితమే ఇంటినుంచి బయటికి వచ్చాడు. అప్పుడే ఎందుకు ఫోన్ చేస్తోంది అనుకున్నాడు.

ఫోన్ ఎత్తగానే శారద స్వరం హీనంగా వినిపించింది.

"ఏమండీ మీరు వెళ్ళాక తలుపేసుకున్నానా? ఉన్నట్లుండి కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళంతా చెమటలు తగని నీరసం.."

"అయ్యో! అదేంటి ఇంత సడన్‌గా? వస్తున్నా"

సుందరం కంగారుగా బైక్‌ని వెనక్కి తిప్పి ఇంటిముందు ఆపాడు.

శారద తలుపు బార్లా తీసి సోఫాలో కూర్చుంది. భర్తని చూడగానే బాధగా చెప్పింది.

"ఏంటో అయోమయంగా ఉందండీ. స్నానం చేసినట్లు ఒళ్ళంతా తడిసి పోయింది"

"నువ్వు మాట్లాడకు. విశ్రాంతిగా పడుకో. హాస్పిటల్‌కి వెళ్దాం" సుందరం చెప్పాడు. అతనికి ఏం చేయాలో తోచడంలేదు. కాళ్ళూ చేతులు ఆడటంలేదు.

ఈ హడావిడికి బయటకి వచ్చిన పక్కింటాయన వెంటనే పరిస్థితిని అర్థం చేసుకుని లోపలికి వెళ్ళి కారు తాళాలు తీసుకుని చెప్పాడు.

"మా కార్లో హాస్పిటల్‌కి వెళ్దాం సుందరంగారు. ఆవిడ్ని నడవనీయకుండా ఎత్తుకుని కార్లో పడుకోపెడదాం."

ఆయనకి చేతులెత్తి నమస్కారం పెట్టి సుందరం శారదని చేతులమీద చిన్నపిల్లలా ఎత్తుకుని కారు వెనక సీట్లో పడుకోపెట్టి, తలని తన ఒళ్ళోపెట్టుకున్నాడు.

శారద భర్త చేతిని గట్టిగా పట్టుకుని అతని కళ్ళల్లోకి చూస్తూ బలహీనంగా చెప్పింది.

"ఏంటో గాబరాగా ఉందండి. కళ్ళు సరిగా కనిపించట్లేదు."

"మాట్లాడకుండా పడుకో శారదా. హాస్పిటల్‌కి వెళ్తున్నాంగా. అంతా సరైపోతుంది." సుందరం దుఃఖాన్ని అణచుకుంటూ చెప్పాడు.

అతన్ని సూటిగా చూసే శారద చూపు నిలిచిపోయింది. శ్వాస నెమ్మదై క్రమంగా ఆగిపోయింది.

హాస్పిటల్ ఆవరణలో కారు పార్క్ చేసి స్ట్రెచర్ తెప్పించిన పక్కింటాయనకి పరిస్థితి అర్థమైంది.

"దారిలోనే ప్రాణంపోయింది" డాక్టర్ మాట వినగానే సుందరం కళ్ళు తిరిగి పడిపోయాడు.

శారద కర్మకాండలు ముగిసాయి. సుందరం ఇంకా మనుషుల్లో పడలేదు. బరువు, బాధ్యతలన్నీ కూతురు, అల్లుడు సజావుగా నిర్వర్తించారు. పన్నెండోరోజున కూతురు సుమన తండ్రి దగ్గరకి వచ్చి చెప్పింది "మేము రేపు ఇంట్లో ఉండకూడదుట నాన్నా. మా ఇంటికి వెళ్ళిపోతున్నాం. నువ్వూ వస్తావా?"

కూతుర్ని పట్టుకుని సుందరం భోరున ఏడ్చాడు. తర్వాత తెప్పరిల్లి చెప్పాడు. "వద్దమ్మా. నువ్వే ఉమ్మడి కుటుంబంలో ఉన్నావు. నేను రావడం బావుండదు. రేపటినించి నేను ఆఫీసుకి వెళ్తా."

సుమన కూడా తండ్రితో కొద్దిసేపు దుఃఖించి, తర్వాత కళ్ళు తుడుచుకుని చెప్పింది.

"అమ్మ ఫ్రెండ్ కనకమ్మగారితో మాట్లాడాను నాన్నా. నీకు రోజూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, రాత్రి భోజనం కేరేజీ పంపిస్తానంది. నెలకి ఐదువేలు ఇస్తామని చెప్పా, ఈ నెలకి ఆవిడకి ఇచ్చేసాను. రోజూ వాళ్ళబ్బాయి వచ్చి ఇచ్చి నిన్నటి కేరేజీలు తీసుకువెళ్తాడు. పనిమనిషికి కూడా గట్టిగా చెప్పాను. ఇల్లు అమ్మ ఉన్నప్పటిలా శుభ్రంగా ఉంచమని.." ఆమె మళ్ళీ కన్నీరు పెట్టుకుంది.

"నేను బానే ఉంటాలేమ్మా. బాధపడకు" సుందరం కూతుర్ని ఓదార్చాడు.

సుందరం ఆఫీస్‌కి వెళ్ళగానే అంతా అతని చుట్టూ గుమికూడి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు.

"ఏభై ఏళ్ళకే హార్ట్ అటాక్ ఏమిటో"

"ఐనా ఏడాదికోసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలి."

"నీలాంటి సాధు జీవికి రావాల్సిన కష్టం కాదిది."

చివరికి అందరూ ఏకగ్రీవంగా చెప్పారు.

"ఏదైనా అవసరం ఉంటే చెప్పు. మొహమాట పడకు."

ఆఫీస్ నించి ఇంటికి వచ్చాక సుందరానికి ఏమీ తోచలేదు. శారద ఉన్నప్పుడు ఏవో కబుర్లు చెప్తూండేది. కొన్ని విని, కొన్ని వినక ఊఁకొడుతూండేవాడు. ఇప్పుడు ఆ కబుర్లు చెప్పేవాళ్ళు లేరు. ఇల్లంతా నిశ్శబ్దం. సుందరం స్నానం చేసి, భోజనం చేసి పదింటికల్లా పడుకున్నాడు. అతనికి తన మీదే దృష్టి నిలిపి కన్నుమూసిన శారదే గుర్తుకొస్తోంది. భయం. భయంతో సుందరం లేచి లైట్ వేసుకుని,

టివి ఆన్ చేసి ఆ శబ్దాలు వింటూ నిద్రకోసం ప్రయత్నించాడు. తెల్లారుఝామువరకూ నిద్రపట్టనేలేదు. సుందరానికి మృతదేహాన్ని చూడటం అంటే తగని భయం.

సుందరం పన్నెండో ఏట ఓ రోజు స్కూల్ ఆవరణలో కబడీ ఆడుకుంటూంటే, పక్కింటబ్బాయి పరిగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు.

"ఒరే సుందరం! మీ నాన్నని లారీ గుద్దేసిందిరా."

ఆ మాటలు విన్న సుందరం కూత పెట్టడం మానేసి, ఏడ్చుకుంటూ వాడి వెనక పరిగెత్తాడు. వాళ్ళింటికి పదిగజాల దూరంలో సుందరం తండ్రి లారీ చక్రం కింద చిక్కుకుని కనిపించాడు. రక్తం రోడ్డుమీదకి కారి మడుగులు కట్టింది. ఆయన మొహం వికృతంగా, నెత్తురు ముద్దలా వుంది. సుందరం స్పృహ తప్పి కిందపడిపోయాడు.

దాదాపు మూడు నెలలవరకూ సుందరం మనిషి కాలేదు. రెండు నెలలపాటు జ్వరంతో బాధపడ్డాడు. కళ్ళు మూసుకుంటే చాలు తండ్రి మొహమే గుర్తొచ్చి లేచి కూర్చునేవాడు. అదంతా తండ్రిమీద బెంగ అని భావించిన తల్లి కొడుకైనా తనకి దక్కుతాడా అని దిగులుపడింది.

సాయంత్రమైతే చాలు సుందరానికి భయం వచ్చేది. ఏ సంధ్యా సమయంలో తండ్రి మృతదేహాన్ని చూసాడో ఆ సమయంలో అతనికి వెన్నులోంచి వణుకు వచ్చేది. అస్తమించే సూర్యుడంటే అమిత భయం. తల్లి కొంగు పట్టుకుని ఆవిడ వెనకాలే తిరుగుతూండేవాడు.

పదో తరగతిలో తోటి పిల్లలతో కలిసి కృష్ణానదిలో ఈతలు కొట్టేవాడు. ఓసారి వాడితో కలిసి ఈదిన నారాయణ వాడి కళ్ళముందే సుడిగుండంలో చిక్కుకుని మునిగిపోయాడు. పిల్లలంతా అరుస్తూ కేకలు పెట్టారు. చుట్టుపక్కల పొలాల్లో పనిచేవాళ్ళు వచ్చి నీళ్ళపై తేలిన నారాయణ శవాన్ని బయటికి తీసారు. నీళ్ళతో ఉబ్బి తెల్లగా పాలిపోయిన నారాయణ దేహాన్ని చూడగానే సుందరం కెవ్వున కేకవేసి కళ్ళు తిరిగి పడిపోయాడు. వాడు మామూలు మనిషి అవడానికి మూడునెలలు పట్టింది.

ఈ సంఘటనలతో, తను శవాలని చూడలేడని, చూసి భరించలేడని సుందరానికి అర్థమైంది. స్కూల్‌కి వెళ్ళేప్పుడు, వచ్చేప్పుడు దారిలో శవయాత్ర కనిపిస్తే, కళ్ళు గట్టిగా మూసుకునేవాడు. ఐనా జడుపు జ్వరం వచ్చేది.

ఇంటర్మీడియెట్‌లోకి వచ్చాక తన భయం గురించి తల్లికి చెప్పాడు. ఆవిడ సుందరానికి చావు వార్తలు చెప్పకుండా, చూడకుండా జాగ్రత్తపడేది. వయసు పెరిగినా సుందరంలో ఆ భయం పోలేదు. టి.వీలో, పేపర్లలో చావు వార్తలు వస్తే చదివేవాడు కాదు. ఛానల్ తిప్పేసేవాడు.

దగ్గర బంధువులు లేని సుందరం తల్లితో అనుబంధం పెంచుకున్నాడు. బుద్ధిగా చదువుకుని ఇరవై మూడేళ్ళకే ఉద్యోగం సంపాదించాడు. తల్లి చెప్పినట్లుగా ఇరవై ఐదేళ్ళకి శారదని పెళ్ళి చేసుకున్నాడు. ఇరవై ఆరేళ్ళకల్లా కూతురు పుట్టింది. తల్లిపేరు సుమతిని ఆధునీకరించి సుమన అనిపేరు పెట్టాడు.

పెళ్ళయ్యాక సుందరం తన బలహీనతని శారదకి చెప్పాడు. ఆమె కూడా భర్తని, అర్థం చేసుకుని, అలాంటి వార్తలు అతని చెవినపడకుండా జాగ్రత్త పడేది.

సుందరంకి తగిలిన మరో షాక్ తల్లి మరణం. ఓ ఉదయం, 'అమ్మా! ఇంకా లేవలేదే?' అంటూ ఆవిడ గదిలోకి వెళ్ళిన సుందరానికి నోరు తెరిచి, నిశ్చలంగా పడివున్న తల్లి కనిపించింది. పెద్దగా అరిచి పడిపోయాడు. శారద పరిగెత్తుకు వచ్చింది. సుందరం ఆ దెబ్బకి ఆర్నెల్లదాకా కోలుకోలేకపోయాడు. శారద అతన్ని కన్నతల్లిలాగే ఊరడించింది.

ఆ తర్వాత సుందరం జీవితం ఓ గాడిన పడింది. డిగ్రీ అవగానే కూతురికి పెళ్ళిచేసాడు. రిటైరవగానే విహారయాత్రలకి వెళ్ళాలని, కూతురికి పిల్లలు పుడితే మనవళ్ళతో ఆడుకోవాలని శారదతో కబుర్లు చెప్పేవాడు. భార్యతో సాన్నిహిత్యం బాగా పెరిగింది.

కానీ అకస్మాత్తుగా ఏభై మూడేళ్ళ సుందరం ఏకాకిగా మిగిలాడు. శారద లేని విషాదాన్ని ఆమె తన చేతుల్లోనే పోవడాన్ని అతను జీర్ణించుకోలేకపోయాడు. అర్ధరాత్రుళ్ళు వెక్కి వెక్కి ఏడ్చేవాడు. ఎక్కువ సమయం ఆఫీస్‌లో గడిపేవాడు.

సుమన నెలకోసారి వచ్చి తండ్రిని పరామర్శించి, ఇల్లు సర్దివెళ్తూండేది. ఆమె ఉన్నంతసేపు ఒక సంతోషం కానీ సాయంత్రానికి అల్లుడు వచ్చి తీసుకు వెళ్తూంటే నిస్సహాయంగా చూస్తూండి పోయేవాడు.

ఏడాది గడిచింది. శారద సంవత్సరీకాలు కూడా పూర్తయ్యాయి. సుందరం మళ్ళీ మామూలు మనిషయ్యాడు. ఏభై నాలుగేళ్ళ సుందరానికి ఇప్పుడు తనకో ఆడతోడు ఉంటే బావుండను అనిపిస్తోంది. అతని శరీరం స్త్రీ స్పర్శకోసం ఆరాట పడుతోంది. 'ఇంకో పెళ్ళి చేసుకుంటే' అవే ఆలోచన తరుచూ వస్తోంది.

కానీ చెప్పడానికి మొహమాటం. బిడియం. ఎవరైనా ఆ ప్రసక్తి తెస్తారేమో అని చూసాడు కానీ ఎవరూ మాట్లాడలేదు.

ఓ ఆదివారం సుమన వచ్చి ఇల్లు సర్దుతూ, సరిగ్గా పనిచేయనందుకు పనిమనిషిని అరుస్తోంది.

"నాన్నగారికి ఇంకో పెళ్ళి చేస్తే ఇంటికో అమ్మగారు వస్తుందమ్మ. పనివాళ్ళు ఎంత చేసినా ఇంటామె చేసినట్లుంటుందా? మేం పదిళ్ళలో పనిచేసేవాళ్ళం. మీ ఒక్కింట్లోనే అంతేసపు చేయలేంగా?" పనిమనిషి నసుగుతూ చెప్పింది. పేపర్ చదువుతున్న సుందరం కూతురి సమాధానం కోసం చెవులు రిక్కించాడు.

"చాల్లే నోర్ముయ్! నీ మాటలు మా నాన్న వినుంటే నిన్ను ఇంట్లోంచి వెళ్ళగొట్టేవాడు. మా నాన్నకి మా అమ్మంటే ఎంత ప్రేమో తెలుసుగా? అమ్మ పోయిన ఏడాది దాకా ఆయన మనుషుల్లో పడలేదు. అలాంటివాడికి రెండో పెళ్ళి అంటావా? నీకు బుద్ధుందా.." కూతురు తిడుతూనే ఉంది.

సుందరం దీర్ఘంగా నిట్టూర్చి పేపర్లో తల దూర్చాడు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments